క్లుప్తంగా...

నేడు విద్యుత్ దినోత్సవం

మేడ్చల్: దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆదివారం విద్యుత్ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఏడీఈ సత్యనారాయణ రాజు తెలిపారు. పట్టణంలోని శ్రీగార్డెన్‌లో నియోజకవర్గ స్థాయి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు అందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రజావాణి తాత్కాలికంగా రద్దు

సాక్షి,మేడ్చల్ జిల్లా: రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో ప్రతి సోమవారం నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 22 వరకు తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రం 9 వసంతాలు పూర్తి చేసుకొని 10 వ వసంతంలోకి అడుగిడిన సందర్భంగా ఈ నెల 22 వరకు ప్రతి రోజు ఒక్కో కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో అధికారులందరూ ఆ కార్యక్రమాలలో పాల్గొంటున్నందున 'ప్రజావాణి' తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. ప్రజావాణి కార్యక్రమాన్ని తిరిగి ఈ నెల 26న (సోమవారం) నుంచి ప్రారంభిస్తామని కలెక్టర్ అమయ్ కుమార్ స్పష్టం చేశారు.

పవిత్రతకు అద్దం పట్టే తీర్థయాత్రలు



మేడ్చల్: పవిత్రతకు అద్దం పట్టెలా తీర్థయాత్రలు ఉంటాయని బీజేపీ మధ్యప్రదేశ్ రాష్ట్ర ఇంచార్జ్ మురళీధర్‌రావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి వెంకటేశ్వర ఆలయం వద్ద గోదావరి తీర్థ యాత్రను ఆయన ప్రారంభించారు. గోదావరి హారతి లో భాగంగా తీర్థ యాత్రలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రంరెడ్డి, నాయకులు ప్రేందాస్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇది రైతు ప్రభుత్వం



రైతుదినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి, జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ తదితరులు

కీసర: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోందని మంత్రిచామకూర మల్లారెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం కీసర మండలంలోని కీసర, యాద్గార్‌పల్లి గ్రామాల్లోగల రైతు వేదికల వద్ద నిర్వహించిన రైతు దినోత్సవ కార్యక్రమాల్లో మంత్రి మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి మట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని, సీఎం కేసీఆర్ సారథ్యంలో రైతులకు అన్ని సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. అంతకుముందు కీసర అమరవీరుల స్థూపం నుండి కీసర మండల ప్రజాప్రతినిధులు, రైతులు, బోనాలతో, ట్రాక్టర్ల ర్యాలీలతో రైతువేదిక వద్దకు ర్యాలీగా తరలి వెళ్లారు. జిల్లాకలెక్టర్ అమయ్‌కుమార్, అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, ఆర్డీఓ రవికుమార్, ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ,నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మెన్‌మల్లేష్ యాదవ్, సొసైటీ అధ్యక్షుడు రామిడి ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ జె.సత్తిరెడ్డి, వ్యవసాయాధికారి మాధవీలత, సర్పంచులు పాల్గొన్నారు.

శామీర్‌పేట్: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లో రైతు దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమాలకు మంత్రి మల్లారెడ్డి హాజరయ్యారు.

పండగలా రైతు దినోత్సవం

మేడ్చల్: దశ చరిత్రలో కనివినీ ఎరుగని రీతిలో సీఎం కేసీఆర్ రైతులకోసం పని చేస్తున్నాడని మంత్రి మల్లారెడ్డి అన్నారు. దశాబ్ది వేడుకలలో భాగంగా రెండో రోజు రైతు దినోత్సవాన్ని మండలంలోని రాయిలాపూర్ రైతు వేదిక వద్ద ఘనంగా నిర్వహించారు.సభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రైతులపై మక్కువ చూపించి అన్ని సదుపాయాలు కల్పించారన్నారు. అంతకుముందు గ్రామాల నుండి అందంగా ముస్తాబు చేసిన ట్రాక్టర్లు ఎడ్లబండ్లలో రైతులను తరలించి గ్రామాలలో పండగలను నిర్వహించారు. బోనాలతో ఊరేగింపు నిర్వహించారు.పెద్ద వేదిక ఏర్పాటు చేసి నాయకులు ప్రసంగాలు ఇచ్చారు. జిల్లా రైతు బంధు అధ్యక్షుడు నందారెడ్డి, మండల అధ్యక్షుడు బలరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గెటప్ మార్చిన మంత్రి మల్లారెడ్డి



మేడ్చల్: తాను ఏ పని చేసినా మాట తీరుతో హల్‌చల్ చేస్తూ అందరినీ నవ్వించే మంత్రి మల్లారెడ్డి ఈ సారి రైతుగా గెటప్‌లో సందడి చేశారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శనివారం నిర్వహించిన రైతు దినోత్సవం మంత్రి మల్లారెడ్డి రైతులా ఆకట్టుకున్నారు. ధోవతి కట్టి, తలకు రుమాలు చుట్టి, నాగలి పెట్టి సమావేశాలకు హాజరయ్యారు. రైతులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.

తరలివచ్చిన అన్నదాతలు



- తొమ్మిది రైతు వేదికల్లో రైతు దినోత్సవ సంబురాలు
- ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల ర్యాలీలతో పండుగ వాతావరణం
- రైతులతో సహపంక్తి భోజనాలు చేసిన మంత్రి, కలెక్టర్ అమయ్ కుమార్

సాక్షి,మేడ్చల్ జిల్లా: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మేడ్చల్ జిల్లాలో సీఎం కేసీఆర్ దత్తత గ్రామం మూడుచింతలపల్లితో పాటు కీసర, శామీర్‌పేట, అలియాబాద్, మేడ్చల్ తదితర తొమ్మిది రైతు వేదికల వద్ద వ్యవసాయ శాఖ రైతు దినోత్సవం సంబురాలను ఘనంగా నిర్వహించింది. రైతు వేదికలను పూలతో అలంకరణ చేసిన రైతులు ప్రత్యేకంగా ఎడ్లబండ్లను ముస్తాబు చేసి, ట్రాక్టర్లలో తరలి వచ్చారు. ఈ సందర్భంగా మహిళా రైతులు బోనాలు నెత్తిన పెట్టుకోగా మరికొందరు నృత్యాలతో పండుగ వాతావరణాన్ని తలపించారు. రైతులను సంఘటితం చేసేందుకు ప్రతి 5వేల ఎకరాలకు ఒక క్లస్టర్ చొప్పున జిల్లాలో తొమ్మిది రైతువేదికల ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా జిల్లా మంత్రి సీహెచ్ మల్లారెడ్డి, కలెక్టర్ అమయ్‌కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ రైతు వేదికల్లో పంటలపై రైతులకు వచ్చే అనుమానాలు నివృత్తి చేసే విధంగా ఏఈఓలు, శాస్త్రవేత్తలు అందుబాటులో ఉండేలా చూస్తామన్నారు. జూన్ 22 వరకు రాష్ట్ర అవతరణ దినోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న వివిధ రకాల కార్యక్రమాలను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. ఉత్సవాల్లో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి , ఆర్డీవో రవి, జిల్లా వ్యవసాయాధికారి రేఖామేరీ డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్, మేడ్చల్ జిల్లా రైతుబంధు అధ్యక్షులు నందారెడ్డి, రైతులు పాల్గొన్నారు.



ఉత్తమ రైతుకు అవార్డు అందజేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మెన్ భాస్కర్‌యాదవ్

మేడ్చల్ రూరల్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని పూడూర్ గ్రామ పరిధిలోని రైతు వేదిక కార్యాలయం వద్ద రైతులతో కలిసి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రైతులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. మార్కెట్ కమిటీ చైర్మెన్ భాస్కర్‌యాదవ్, జిల్లా రైతు బంధు అధ్యక్షులు నందారెడ్డిలు ప్రసంగించారు. అనంతరం పలు గ్రామాలకు చెందిన ఉత్తమ రైతులకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దేవసహాయం, ఏడీఏ వెంకట్‌రాంరెడ్డి పాల్గొన్నారు.

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో..

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో రైతు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన రైతు పొలం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మిశ్రీనివాస్‌రెడ్డి రైతులను సన్మానించారు.

పాత వస్తువులను తిరిగి వినియోగించాలి



పాత వస్తువులు సేకరిస్తున్న వైస్ చైర్మన్ మాధవరెడ్డి

ఘట్‌కేసర్: పాత వస్తువులు తిరిగి వినియోగించడమే ఆర్‌ఆర్‌ఆర్ ఉద్దేశ్యమని మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి అన్నారు. పట్టణంలోని తొమ్మిదో వార్డు ఈడబ్ల్యూఎస్ కాలనీ తెలుగు మీడియం స్కూల్ ఆవరణలో ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం వ్యర్థాలను తగ్గించడం, పునర్వినియోగం, రీ సైకిల్ చేయాలన్నారు. కేంద్ర పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ద్వారా 'మేరీ లైఫ్, మేరా స్వచ్ఛ్ షెహర్' పేరుతో ప్రత్యేక డ్రై వ్ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వేమనరెడ్డి, కౌన్సిలర్లు రమాదేవి, అనురాధ, ఆంజనేయులు, నర్సింగ్‌రావు, కోఆప్షన్ సభ్యుడు షౌకత్, సిరాజ్, పద్మ, సురేశ్, ప్రణయ్‌రెడ్డి, మేనేజర్ అంజిరెడ్డి పాల్గొన్నారు.

అప్పటికీ.. ఇప్పటికీ ఎంతో తేడా

ఘట్‌కేసర్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం రాక ముందు, వచ్చిన తరువాత వ్యవసాయ రంగంలో చాల తేడా ఉందని జెడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి అన్నారు. ప్రతాపసింగారం రైతు వేదికలో రైతు బంధు మండల కోఆర్డినేటర్ అంజిరెడ్డి అధ్యక్షతన శనివారం రైతు దినోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చైర్మన్ మాట్లాడుతూ రైతును రారాజు చేయడానికి రైతు బంధు, సాగునీరు, ఉచిత విద్యుత్, రైతు బీమా, పంట పెట్టుబడిని ప్రభుత్వం అందజేస్తుందన్నారు.

శామీర్‌పేట నూతన ఎస్‌హెచ్‌ఓగా నిరంజన్‌రెడ్డి



శామీర్‌పేట్: శామీర్‌పేట నూతన ఎస్‌హెచ్‌ఓగా సీఐ నిరంజన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన శనివారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో హైదరాబాద్ కమీషనరేట్ పరిధిలోని గోపాల్‌పురం, పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లలో ఎస్‌హెచ్‌ఓ గా విధులు నిర్వహించి, బదిలీ పై శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌కు వచ్చారు.

విద్యుత్ విజయోత్సవాన్ని విజయవంతం చేయండి

ఘట్‌కేసర్: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో మేడ్చల్‌లోని శ్రీ గార్డెన్‌లో సోమవారం నిర్వహించనున్న 'తెలంగాణ విద్యుత్ విజయోత్సవం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలిన ఏడీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. మేడ్చల్ డిపో నుంచి కిష్టాపూర్ రోడ్డు కేఎల్లార్ వెంచర్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్న విద్యుత్ విజయోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

పోచారం: అన్నోజిగూడలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో ఓ పిచ్చికుక్క జనాలపై శనివారం సాయంత్రం దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. ఒకేసారి ఏడుగురిపై విరుచుకుపడింది. వీరిలో హర్ష (9), హర్షిత్ (6), వెంకటేశ్వరరావు (45) కాళ్లపై రక్తం కారేలా కరిచింది. మిగతా వారు స్వల్ప గాయాలకు గురయ్యారు.

మహిళ ఆత్మహత్య

పోచారం: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. పోచారం సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన మేరకు.. బీహార్‌కు చెందిన సద్రోజ్ ఖాన్, సావన ఖాటున్ దంపతులు జోడిమెట్లలో నివసిస్తున్నారు. సావన (19) భర్త శనివారం ఉదయం బెడ్‌రూమ్ లోకి వెళ్లేందుకు తలుపు తీయగా తెరచుకోలేదు. లోపలి నుండి తాళం వేసినట్లు గమనించాడు. అతికష్టంమీద తలుపు తెరవగా చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకుని చనిపోయినట్లు గమనించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

మౌలాలి: మౌలాలి డివిజన్ సంతోషి మాత కాలనీలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించే యూజీడీ పనులను శనివారం కార్పొరేటర్ గున్నాల సునీతశేఖర్‌యాదవ్ ప్రారంభించారు. మౌలాలి డివిజన్ పరిధిలో ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు.

ఎల్లంపేట్‌లో బడిబాట



బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, నాయకులు

మేడ్చల్ రూరల్: మండలంలోని ఎల్లంపేట్ గ్రామంలో శనివారం విద్యాశాఖ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించి బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో అత్వెల్లి పాఠశాల హెచ్ఎం రామారావు, ఎంపీటీసీ కుమార్ యాదవ్, ఉపాధ్యాయులు గడప నవీన్, వసీం, మంజుల వాణి, నాయకులు రామకృష్ణుడు, జగన్‌గౌడ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మన ఊరు మన బడి ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న హెచ్ఎం పాపిరెడ్డి, పీడీ వినోద్‌కుమార్ తదితరులు

ఘట్‌కేసర్: పట్టణంలోని జెడ్పీ బాలుర పాఠశాల ఉపాధ్యాయులు, మేనేజ్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో మన ఊరు మన బడి ర్యాలీని మున్సిపాలిటీలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యానర్లు, కరపత్రాలు పంపిణీ చేశారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని అవగాహన కల్పించారు. హెచ్ఎం పాపిరెడ్డి, పీడీ వినద్ కుమార్, ఉపాధ్యాయులు రాధిక, సంధ్యారాణి, మదన్‌మోహన్ పాల్గొన్నారు.

చెత్తమయంగా మేడ్చల్ రైల్వేస్టేషన్

మేడ్చల్: స్వచ్ఛ భారత్, స్వచ్ఛ సర్వేక్షణ్ స్ఫూర్తితో అందంగా ఉండాల్సిన మేడ్చల్ రైల్వే స్టేషన్ చెత్తమయంగా మారింది. పరిశుభ్రతలో కేంద్ర రైల్వే మంత్రి ప్రశంసలు అందుకున్న ఈ స్టేషన్‌లో ఇపుడు ఎక్కడ చూసినా చెత్త కనిపిస్తోంది. స్టేషన్‌లో ఉన్న 5 ఫ్లాట్‌ఫారాలను శుభ్రం చేయకపోవడంతో ఎక్కడి పడితే అక్కడ చెత్త కనిపిస్తోంది. స్టేషన్ ఆవరణలో ఉన్న ఇంజనీర్ కార్యాలయ అవరణ, స్టేషన్ ముందు ఉన్న గార్డెన్, ఇలా ఎక్కడ చూసినా చెత్తే... అధికారులు పట్టించుకోకపోవడంతో మేడ్చల్ రైల్వే స్టేషన్ చెత్తమయంగా మారింది.

